అంటు

ఉత్తరంలోని విషయాల్ని మరోసారి మననం చేసుకొన్న కొండన్నకు ఆనందంతో బాటు ఆత్రుత కూడ ఎక్కువైంది. చేని దగ్గర్నుంచి ఎప్పుడెప్పుడు ఇంటికి చేరుకుందామా అని ఆరాటంగా ఉంది.

గగనం దిక్కు చూశాడు.

మబ్బుల చాటున పొద్దు మసకేసి ఉంది. మధ్యాహ్నానికో, సాయంత్రానికో వాన వంగేట్టుంది. దేవమూల అప్పుడప్పుడూ ఉరుముతూ ఉంది.

ఉత్తరలో ఉరిమితే ఖచ్చితంగా వానొస్తుందట!

అందులోనూ ఇది రైతుల కార్తె.

కొండన్న గుండెల్లో సన్నని జలదరింపు మొదలైంది.

ఈ కూలీల్తో సాయంత్రం దాకా సంతనగా పన్జేయించుకొంటేగాని చేనంతా పత్తి విరవటం అయిపోదు. మధ్యలో వానొస్తే పత్తి అంతా మట్టిపాలు.

నిండు రోహిణి కార్తెలో ఈ పైరు మొలిపించుకొనేందుకు తానెంత అగచాట్లుబడింది కళ్ళముందు మెదిలింది.

సర్కారోళ్ళు ఏడెకరాలు పట్టా ఇచ్చి ఉచిత బోరుబావి తవ్వించారు గాబట్టి పత్తిపైరు పెట్టడం సాధ్యమైంది. లేకుంటే తామెక్కడ? ఈ ఎండాకాలం పైరెక్కడ?

ఈ భూమి, బోరుబావి తను పొందటంలో స్టీఫెన్ సహాయం కూడా కొంత ఉంది.

దళితుల సహాయార్థం అతను ఎంతోపాటు బడుతున్నాడుట.

పక్కతాలూకాలోనే, ఏదో ఊర్లో అగ్రవర్ణాల వారికి చెందిన మంచినీటి కుంటలో హరిజనులు కూడా గొంతు తడుపుకొనేందుకు ఎదురైన ఆటంకాల్ని తొలగించేందుకు కలెక్టర్ తోటి వస్తున్నాడుట.

ఆ సందర్భంగా తన్ను కలుసుకొనేందుకు ఈ రోజు వస్తానని రాశాడు.

పాలెమంతా తిరిగి తిరిగి రంగని దగ్గర పెద్ద కోడిపుంజు నొకదాన్ని నూర్రూపాయలకు బేరమాడి పట్టుకొచ్చి ఇంట్లో గంపకింద వేసివచ్చాడు కొండన్న.

స్టోరు బియ్యం బావుండవని శేరు పద్దైదు రూపాయలొంతున మొలగొలుకుల బియ్యం కొనుక్కొచ్చి ఉంచాడు.

రాకరాక వచ్చే చుట్టం.

దాదాపు ముప్పయేళ్ళయింది ఊరొదిలి.

సింగరయ్యగా ఊరొదలిన వాడు స్టీఫెన్‌గా మారాడు.

పదిమందికి బతుకుదెరువిచ్చేంత పైస్థాయికి ఎదిగాడు.

"కొండన్నో! గంప దీసకరా వొడి నిండింది" కేకేసింది ఒక కూలి.

ఆలోచనల్నుంచి తేరుకొని గంప అందుకున్నాడు కొండన్న. తన సంచిలోని పత్తిని గంపలోవేసి అందరి వద్దకు తిరిగాడు.

రెండు గంపలైంది.

"నీల్లు దప్పి కెయితండా యన్నో!" కేకేసింది మరోకూలి.

"అయిగోమ్మా, బిందెనిండా... వంకలో నీల్లు బురదని. బోరింగు కాడ పట్టుకొచ్చినా." చెప్పాడు.

"బిందె మీదేనా?" అనుమానంగా చూసింది.

"కాదమ్మా! మారైతు నారాయణ్రెడ్డిది."

"తెచ్చింది నువ్వేగాదూ?" ఆమె నొసలు ముడి ఇంకా విడివడలేదు.

"నేనుగాక! నాకు రైతులు కూలి కొస్చరా తల్లీ?"

నీళ్ళకోసం బిందెవద్ద కొస్తున్న వాళ్ళు కాస్తా ఆగిపోయారు. ఒకరి కేసి మరొకరు చూసుకొని, గుసగుసలాడుకొని, "వంకలో నీళ్ళే తాగొస్చంలే" అంటూ వెనుదిరిగారు.

ఉస్సురుమన్నాడు కొండన్న.

పళ్ళికిలిస్తూ, పరాచికాలాడుకొంటూ, హంస గమనాల్తో వాళ్ళు వంకలోకి వెళ్ళొచ్చేసరికి ఎంతలేదన్నా పదినిమిషాల సమయం అర్థగంట అవుతుంది.

మబ్బెక్కి వచ్చే ఆకాశం కేసి దిగాలుగా చూసి పత్తి విరవటాన్ని కొనసాగించాడు.

కూలీలంతా తిరిగొచ్చారు.

కళ్ళు మిరుమిట్లు గొలిపే పసుపుపచ్చని తంగేడుపూలు తలలో తురుముకుంటూ తన మునంలో వంగబోతూ అడిగింది మరోకూలి "సంగటి రైతు లిండ్లల్లో సేయస్చాండవా, లేదా?" అని.

"రైతు లిండ్లల్లోనే సేయిస్చాండలే తల్లీ!"

"మీరు తగిలేరు... వాళ్ళ సేతనే తెచ్చి పెట్టీయండి" చెప్పింది.

"ఆ...ఆ..." ఒప్పుకోలుగా ఊ కొట్టాడు కొండన్న.

ఈ కూలీలు తమ చేతి నీళ్ళు తాగరు. తమ కుండలోని పిడచ తినరు. ఎందుకంటే వాళ్ళు మాదిగలు. తాము మాలలు కాబట్టి.

* * * *

మునంలోంచి తలెత్తి ఊరికేసి చూసేసరికి, చేల గెట్లంట రవరవ సుడిగాలిలా దూసుకొచ్చే భార్య కనిపించింది కొండన్నకు.

ఆమె నడకే అంత.

ఎప్పుడూ ఉరుకుల పరుగుల మీదుంటుంది. కనుదెరిచింది మొదలు కనుగూరికే దాకా ఒకటే తొందర. క్షణం తీరికుండదు. నిమిషం ఊర కుండదు. అప్పుడప్పుడూ తాను అంకె వేసినా తన కోపుకూడా ఆమె ఈడ్చుకుపోతుంది.

ఇంత చేసినా బండి సరిగ్గా నడవదు. ఎప్పుడూ కందెన తక్కువై ఇరుసు కీచుకీచుమని అరవటమే.

"అబ్బో! ఓ మొగోడా!... యాం దీమాసి పలకదూ? నిన్నే..." అతను తలెత్తబోయే లోపలే ఆరాటపడుతూ వచ్చింది. అతను ప్రశ్నించబోయే లోపలే చెప్పింది.

"నాకయితే వొల్లు తత్తరబుడ్తావుంది ఏం జేసి పెట్టాలబ్బా? ఏం దింటడో... ఎట్ట దింటడో... బల కొట్టకుండా మూగెద్దాల ఉంటవే? ... ఏం జేస్తవో నువ్వే జెయ్యి." అతను తేరుకోబోయే లోపలే లొడలొడమన సాగింది.

ఒక్కసారిగా స్టీఫెన్ దగ్గరకు ఎగిరిపోదామని పిస్తోంది కొండన్నకు. అంత హోదాలో ఉన్నవాడు తనకోసం, తన ఇంటికి రావటం కొండన్న గుండెల్ని ఆనందంతో తత్తరబెడుతోంది.

అతనికి ఎలా మర్యాదలు చేయాలో తనకు బాగా తెలుసు.

అతని నాలుక ఏఏ రుచులకోసం సవ్వబడి పోయిందో తనకు ఎరుకే. తను హైదరాబాదు వెళ్ళినపుడంతా రాత్రిళ్ళు నిద్రబోనిచ్చేవాడు కాదు. చేయి చంకలోతున బొక్కల్లోకి దూర్చి పట్టుకొచ్చిన ఎండ్రకాయల చారును గూర్చి పలవరించేవాడు.

పంది వార్ల వేపుడు స్మృతుల్ని కెలికేవాడు.

సొద్దసొత్తేలు చేపల పులుసులో కలుపుకు తింటూ చూరునీళ్ళ ధారల్లో జడివానను చూడాలని తపన పడేవాడు.

ఉసుర్లు వేయించి ఉలవ గుగ్గిళ్ళలో కలుపుకొని, జేబునిండా పోసుకొని, పెద్ద తనమంతా వదలి వీధి వీధి తిరగాలనే ఉబలాటం అతనికి.

ఉలవ గుగ్గిళ్ళకు బెల్లం కలిపి రోట పోసి, తొక్కి ముద్ద చేసి రెండు నేతి చుక్కలు అద్దుకు తినటమన్నా, బరిగె కూటిలో పెరుగు కలుపుకొని ఉల్లిగడ్డ నంజుకోవటమన్నా, జొన్న రొట్టెను అప్పుడే పిండుకొచ్చిన జుంటితేనెలో ముంచి నోట బెట్టుకోవటమన్నా, కొర్రకూటాలాగా కలమాగిన దోసకాయను మూతికి పూసుకుంటూ పొంకోవటమన్నా, ఉడకేసిన అనపకాయల బుట్టను ముందేసుక్కూచ్చోవటమన్నా తెగ ఆసక్తి చూపించేవాడు.

పల్లె రుచుల్నీ, సావాసాల్నీ ఇంకా మరవకుండా ఉన్న అతన్ని తల్చుకొని మురిసిపోయేవాడు తను.

అతని కోరికల్ని వీలున్నంతవరకు తను తీర్చేందుకు ప్రయత్నించాలి. తక్షణమే ఇంటికి పరువెత్తాలనిపిస్తోంది కొండన్నకు.

వెంకటమ్మ ఏదేదో చెబుతోంది.

ఇంటివద్ద తనకోసం నులక మంచమ్మీద నిరీక్షిస్తున్నాడు కాబోలు. చుట్టుముట్టిన ముసలీ ముతకల ప్రశ్నలకు సమాధానాలు తడువు కొంటుంటాడు బహుశా.

"మంచినీళ్ళన్నా యిచ్చొచ్చినవా?" అప్పుడు ప్రశ్నించాడు భార్యను.

గడ్డం కింద చెయ్యి అన్చి "యాం దీమాసీ!" అంటూ ఆశ్చర్యపోయింది ఆమె. "ఆయాల్నుంచి సెబుతాంటే నీకు సెవి ఎచ్చబన్నెట్టే లేదే. ఇట్టయితే ఎట్టబ్బా?... మనింటికాడికి రాలే. రెడ్డోరింటికాన్నే ఉండాడంట..." చెప్పింది.

"రెడ్డోరింటి కాన్నా?..."

"ఆ...ఆ నీల్ల పంచాయితి కాడికి రెడ్డోరుగూడా పొయ్యిన్నెడంట. టీపెనన్నను గుర్తుబట్టి ఇంటికి తోడుకొచ్చుకొన్నెడంట...."

కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు కొండన్న.

ఎవ్వరూ లేని తనింటివద్ద కొచ్చి బిక్కు మనేకన్నా కొంతసేపు రెడ్డోరింటి కాడ ఉండటమే మేలనుకున్నాడు.

పెద్దరెడ్డి వద్ద గౌరవం పొందేంత స్థాయికి తన సావాసగాడు ఎదగడం పట్ల గర్వం కూడా కలిగింది.

అతని ఆలోచనల్ని భగ్నంజేస్తూ వెంకటమ్మ అంది – "రైతు లెవురికీ తీరికే లేదంటంద్రే..ఎట్ట జెయ్యాలాబ్బా?" అని.

క్షణకాలం పాటు అయోమయంగా చూశాడు ఆమె కేసి.

"అందర్నీ బంగపొయ్యినా..మాకు పనులుండాయంటే మాకు తీరికే లేదంటే... యమ్మ యమ్మ... ఊరికే సంగటి గెలికియ్య మంటాండమా! అడుగులకు బియ్యమిచ్చిమి... కూరగాయలిచ్చిమి... ఎప్పుడన్నా పనికి పలుకుతాంటిమి"

రైతులెవ్వరూ చెయ్యందియ్యక పోవటం పట్ల ఆశ్చర్యంగా ఉంది కొండన్నకు.

"అయ్యోరు యింట్లోనన్నా అడగ్గాద్దూ!"

"యాండీమాసీ! ఆ యమ్మకేం నాలుగు సేతులుండయా? నిన్న ప్రకాశానికి జెయిస్చె.మొన్న రవనమ్మకు వొండిచ్చె. రోజు ఎవరికోకరికి కుండ గాలుస్నానే ఉండి పోయనే..."

"మనకూ ఒకరోజు గెలికియ్యమని కాల్లో కడుపో పట్టుకుపోయే తిక్కదానా!" ఉపదేశించాడు.

"ఏమోబ్బా! నాకు నమ్మకంలే.." అంటూ వెనుదిరిగింది ఆమె.

కొండన్న కెందుకో కొంత ఆశగా ఉంది.

సంకటి సమస్య ఒకవైపుకు ఒత్తిగిలినట్లే అన్పించింది.

మనస్సు స్టీఫెన్ వద్దకెళ్ళాలని ఉబలాట పడసాగింది.

కూలీల్ని వదలి వెళ్ళేందుకు మబ్బులు భయపెడుతున్నాయి. ఇన్నేళ్ళూ తను వెళ్ళటమే గాని ఎప్పుడూ ఇక్కడకు రాని స్టీఫెన్... తనంటే ప్రాణాలిచ్చే స్టీఫెన్...

తన ప్రాణం లాంటి కొడుక్కి చదువు చెప్పించే స్టీఫెన్...

అతనొచ్చినాడని తెలిసీ తన్నిక్కడుండేటట్లు చేసిన పరిస్థితుల పట్ల ఆక్రోశం కలిగింది కొండన్నకు.

కూలీలు తమ సంకటి తింటే ఈ అగచాట్లు ఉండేటివి కావు. తమ చేతినీళ్ళు కూడా తాగరు.

మాల – మాదిగల మధ్య అనాది నుంచీ ఇంతే.

తనకు ఆశ్చర్యం కలుగుతుంది.... అందరిచేత హీనంగా చూడబడే ఈ కులాలు రెండూ; ఒకర్నొకరు నీచంగా చూసుకోవటం ఏమిటా అని – అగ్రకులాల వాళ్ళు తమ బావుల్లో నీళ్ళు వీళ్ళను తెచ్చుకోనివ్వరు. వీళ్ళు ఒకరి బావి నీళ్ళు మరొకరు అంటరు.

హిందూమతంలో తమను తక్కువ చేస్తున్నారని క్రిష్టియన్ మతంలో చేరిన వాళ్ళలో కూడా ఈ భేదాభావాలు ఏమాత్రం చావలేదు.

మాదిగలు వెళ్లిన చర్చికి మాలలు వెళ్ళరు. మాలలు చేరిన శాఖలో మాదిగలు చేరరు. ఒకరు ఆర్.సి.యం. అయితే మరొకరు కె.బి.యమ్. ఒకరు సి.యస్.ఐ అయితే మరొకరు పెంథకోస్తు....

అక్కడ కూడా క్రిస్టియన్ రెడ్ల క్రిస్టియన్ నాయుళ్ళ...క్రిష్టియన్ అగ్రవర్ణాల గుత్తాధిపత్యం కింద వీళ్ళు నలిగిపోవటమే!

మతం మారమని చాలా కాలం నుంచి తనతో చెబుతున్నాడు స్టీఫెన్.

తన ప్రమేయం లేకుండానే ఇంజనీరింగ్ చదువుతోన్న తనకొడుక్కి మతం మార్పించాడు.

ఎప్పుడో తెల్ల దొరల కాలంలో, పెద్ద కులాల తోటి సమాన గౌరవం కోసం దొరల మతం పుచ్చుకోవటమనేది నిమ్న కులాలకు ఒక మార్గమయితే కావచ్చుగాని, ఇప్పుడది ఏమాత్రం సత్ఫలితాల నిస్తుందని!

మతమార్పిడి వల్ల ఈ పల్లెలో అగ్రవర్ణాల వాళ్ళు తమతో సమానంగా ఈ మాలమాదిగల్ని చూస్తారా? పెద్ద ఉద్యోగం వల్ల మంచి హోదాలో ఉండటమో, బాగా డబ్బు సంపాదించటమో చేస్తే తప్ప....

* * * *

"ఎట్టజెయ్యాలబ్బా?" అంటూ ఆదరాబాదరా వచ్చింది వెంకటమ్మ.

పరిస్థితి అర్థమైంది కొండన్నకు.

గుండెలు లబలబలాడాయి.

"ఆయమ్మ ఈ పూట ఎవురికీ సంగటి జేసి పెట్టలే... సెయ్యనంటంది. ఎర్రోల్ల పిచ్చిదీ... బరుగొడ్లోల్ల పాసిదీ, సుంకన్న పెండ్లామూ నాయాల్నే ఊరంతా పరవేసుకొన్నెరు. ఎందుకోమల్ల... రైతు లెవురూ పలకలేదబ్బా!" చెప్పింది.

పొద్దు కనపళ్ళేదుగాని పైటేల అయింది. ఉబ్బురపు ఎండాగాసుంటే ఇప్పటికే సంకటి కోసం ఎగమల్లి ఉండేవాళ్ళు.

ఏం జెయ్యాలో అర్థం గాకుండా ఉంది కొండన్నకు.

సరుకు లిచ్చి వాళ్ళనే వొండుకోమన్నా కుండా చట్టీ కావాలిగదా! తమవి వీళ్ళు తగలరు.

రైతులు వీళ్ళను తగలనివ్వరు.

జడలు విరబోసుకొని మెల్లిగా నడిచొచ్చే భూతమైంది సంకటి సమస్య కొండన్నకు. నెత్తికి చుట్టుకొనేట్టే ఉంది.

విషయం సగమర్థమై కాక వెంకటమ్మను అడిగింది ఒక కూలి మనిషి.

"ఊరంతా లొడ బెట్టినా ఒక్క తల్లికీ కనికరం పుట్టలే.... మీ కియ్యాల సంగటి లే, సారక లే..." మునంలో వొంగుతూ చెప్పింది వెంకటమ్మ.

"లేకుంటేనా? పైటేలకే రోజు కూలిస్తవ్. ఇంటికి బొయ్యి తింటం"

"ఒక్కొంతుకు రొండొంతుల కూలెందుకిస్సం?"

"అయితే పచ్చుండి పనెట్ట జెయ్యాల? సంగటి బెట్టుమరి – మాపిటేల్దాకా సేస్సం."

"బో సంబడమబ్బా మీది! మా సంగటి తింటే మీదేం తరుగు బోద్ది? ఇద్దరం తగ్గుజాతోల్లమే గదూ! మీ ఎక్కవేంది? మా తక్కవేంది?" చేతులు తిప్పుతూ చెప్పింది వెంకటమ్మ.

దాంతో అక్కడి వాతావరణంలోని ప్రశాంతత మారిపోయింది.

"ఏం నేర్చుకోన్నెవమ్మా నువ్వు! మాలోల్లను మాట్లాడక ముందే కొట్టాలని రైతులంటరు; ఇందుకేనేమో? నీకు పనిబడి నీ ఇంటి పిడ్సను తినమంటివే.. మాల కాకిని గూడా మా ఇండ్లల్లేకి రానియ్యం. మాలోల్ల కుండల్లో నోరు బెడ్తమా? బూమి సంపాయిచ్చుకొని దున్నుకున్నెంత మాత్తరాన పెద్దకులపోల్లుగారు" రోషంగా చెప్పింది ఒక కూలి.

"ముందు మా ఇండ్లల్లో కొచ్చి మాకుండలో పిడ్స ఇంత సేతల్లో యేయించుకొని తినండి. ఇయ్యన్ని మల్ల మాట్లాడ్దాం." ఒడిలో పత్తిని గంపలోకి వదల్తూ విసురుగా అంది ఇంకొక మనిషి.

సంకటి లేకుండా తాము పన్జేసేది లేదనీ, కూలిడబ్బు వెంటనే చెల్లిస్తే తమ ఇళ్లకెళ్ళి ముద్ద మింగుతామనీ అన్నారు వాళ్ళు. పత్తి విరవటం చాలించి గంపలవద్ద కొచ్చారు.

వర్షం వచ్చి దూకేట్టుంది.

తెల్లగా మంచు ముద్దల్లా ఉన్న పత్తి రాలి మట్టి గొట్టుకుపోతుంది. ఆ నష్టానికి తోడు ఒక్కొంతుకే రెండొంతుల కూలి.

"యమ్మా యమ్మా! మా బాసేలికి బుద్దుండో బుద్దిలేకో కూసింది. నేను బొయ్యిసంగటి దెస్చ తల్లీ! వానొస్సే నాశనమయితమమ్మా! పత్తి ఇరుస్సొండండి తల్లీ!" ... కొండన్న బతిమాలాడు.

"ఇప్పుడు బొయ్యి నువ్వు సంగటి సేయిస్చ కొచ్చెదెన్నడు?"

"బువ్వ జేయిస్సొనమ్మా...!" అంటూ వాళ్ళ మాటకు ఎదురుచూడకుండా ఊర్లోకి కదిలాడు.

రెడ్డోరి పంచలోకి తన తల కనబడకుండా ఊరంతా తిరిగాడు కొండన్న. తనున్న పరిస్థితుల్లో స్టీఫెన్ కళ్ళబడాలంటే మనస్కరించట్లేదు. రెడ్ల చేత సేవలు చేయించుకునే అతని వద్దకు రెడ్ల దయాదాక్షిణ్యాల కోసం అంగలార్చే తాను వెళ్ళటం ఎబ్బెట్టుగా అనిపించింది.

ఊర్లో ఒక్కరైతు కూడా తనకు ఆసరా నివ్వక పోవటం ఆశ్చర్యంగా ఉంది అతనికి.

"ఒకరికి సంగటి జేసి పెట్టడం...ఇంగొకరి సేత మాటబడ్డం...ఎందుకొచ్చిన తంటా నాయనా!" అయ్యోరి భార్య అంది.

తంటా వచ్చేది ఎవరితోనో కొండన్నకు అర్థం కాలేదు.

కొండంత దిగులుతో నీరసంగా అడుగులేస్తూ కల్రోలు దగ్గరకొచ్చేసరికి ఆగిపోయాడు....

రెడ్డోరి ఇంట్లో అడిగితే?

స్టీఫెన్ కళ్ళబడకుండా దొడ్డిదారి గుండా వెళ్తేసరి... బహుశా సుభద్రమ్మ కాదనదు. వంట మనిషి కూడా ఉంది గదా!

ఒక్క క్షణం ఆశ మొలిచింది. తప్పని పరిస్థితి మరి.

సందులోంచి తొంగి చూశాడు.

రెడ్డోరి పంచ కన్పిస్తోంది.

పట్టెమంచమ్మీద ఆసీనుడై ఉన్నాడు పెద్దరెడ్డి. పక్కనే ఈజీ ఛైర్ మీద వాలి ఉన్నాడు స్టీఫెన్. ఇద్దరూ సిగరెట్లు పీలుస్తున్నారు.

నేలమీద తమ పాళెం వాళ్ళే కొంతమంది మాలలు కూచుని ఉన్నారు.

కొత్తగా వచ్చి చేరే వాళ్ళు పెద్దరెడ్డి తోటి స్టీఫెన్‌కూ చేతులు జోడించి, అక్కడే నేలమీద కూలబడటం కొండన్నకు ఆశ్చర్యమనిపించింది.

తమకులం వాడు, తమ పాళెం వాడు. తమ వాడయిన స్టీఫెన్‌కు తమ వాళ్ళంతా నమస్కరించటం వింతగా ఉంది అతనికి.

'త నక్కడికి వెళ్ళినా వాళ్ళతోటే....'

భరించలేకపోయాడు.

రేపు తన కొడుకు ఇంజనీరై మంచి హోదాలో ఇక్కడకొస్తే పెద్దరెడ్డి ఇలాగే గౌరవిస్తాడు కాబోలు.

అతని హృదయంలో ఎక్కడో ఆనందపు జలదరింపు.

అంతలోనే అతనికో అనుమానం.

తనకొడుకు పెద్ద రెడ్డి తోటి సమాన హోదాలో ఆసీనుడైనా, తను మాత్రం రెండు చేతులు జోడించి నేలమీద కూచోక తప్పదేమో!

* * * *

ఒంటరిగా వస్తోన్న కొండన్నను చూసి దూరాన్నించే పరిస్థితి అంచనా వేశారు కూలీలు, ఒళ్ళో పత్తి గంపల్లో పడేసి, కడుపులోంచి ఎగదన్నుకొచ్చే ఆకలిని ఆలుమొగుళ్ళమీద కక్కారు.

'ఒక రైతుగ్గాడ మంచి గుండని మీదేంబతు' కన్నారు.

'అడుగు కదపకుండా, కూలిదుడ్లు రాల్చ' మన్నారు.

'వంతు కూలి ఇస్తా' నంది వెంకటమ్మ.

'రోజుకూలి కట్టంది కుదర' దన్నారు వాళ్లు.

అక్కడ కొంత సేపు అరుపులు, తిట్లు చెలరేగాయి.

ఇరుగు పొరుగు చేల వాళ్ళు ఎగమల్లి వచ్చారు.

మాలలు కొండన్నకే వత్తాసిచ్చారు.

పనిబాటల వాళ్ళ కాడ ఏం మాట్లాడినా ఇబ్బందేనని రైతులు మెల్లిగా జారుకొన్నారు.

కొంతసేపు తిట్లాట అనంతరం "నువ్వు రోజుకూలి ఎట్టియ్యవో మేమూజూస్తం.' అంటూ పచ్చని చేలమీద బండ బూతులు దొర్లించుకుంటూ వెళ్లారు మాదిగ స్త్రీలంతా.

తల పట్టుక్కూచుండి పోయాడు కొండన్న.

మాదిగలను కూలికి పిల్చుకొంటే ఇట్లాంటి అగచాట్లు తప్పవు.

తమకు వాళ్ళు తప్ప మరో కులం వాళ్ళు కూలికిరారు మరి!

సంకటి పెట్టలేని ఇంకో ముగ్గురి చేల వద్ద ఇలాగే జరిగిందట.

ఇప్పుడు ఇంటికెళ్ళి సంగటి గెలుక్కొని ఆకలి బూడ్చుకోవటం వాళ్ళకు సాధ్యమయ్యే పనిగాదు.

తమగుండా వాళ్లీపూట పస్తులున్నట్టే.

సమస్యను మరింత జటిలం చేస్తారు వాళ్ళు.

ఎట్లా బైట పడాలో దిక్కుతోచకుండా ఉంది కొండన్నకు.

తనకు తోడు ఇంకొందరున్నారనే విషయం అతనికి కొంత ఊరట నిచ్చింది.

వాన వచ్చి దూకేట్టుంది.

పత్తిగంపలు ఇళ్ళకు మోయాలి.

పనిజరిగుంటే కూలోళ్ళే తలొకగంప మోసుకెళ్ళి ఉండేవాళ్ళు.

అతనిలోని అన్ని సమస్యల్ని ఈ ఆత్రుత ముంచేసింది.

గబగబ రెండు గంప లెత్తుకొని కదిలారు ఆలుమగలిద్దరూ.

ఇంటికెళ్ళేసరికి వాళ్ళ కోసం ఒక వార్త కాచుకుని ఉంది.

సాయంత్రం నాలుగ్గంటలకే స్టీఫెన్ తమ ఇంటికి వస్తాడుట.

పత్తి గంపలు మోస్తూనే స్టీఫెన్ తోటి తిరిగాల్సిన తావుల్నీ, కలవాల్సిన మనుషుల్నీ ఒకసారి మననం చేసుకొన్నాడు కొండన్న. తను హైదరాబాదు వెళ్ళినపుడంతా ఇక్కడి పరిసరాల్ని గురించి స్టీఫెన్ పలవరించేదంతా జ్ఞప్తికి తెచ్చుకున్నాడు.

ప్రసంగాల ద్వారా, పేపర్ స్టేట్‌మెంట్ల ద్వారా, రచనల ద్వారా పెద్ద కులాల కర్ర పెత్తనం మీద అతను చేసే తిరుగుబాటును తల్చుకొన్నపుడంతా కొండన్న ఆశ్చర్యపోతూనే ఉంటాడు.

ఎక్కడ దళితుల మీద అగ్రవర్ణాల వాళ్ళు దాడిజేస్తారో అక్కడంతా ప్రత్యక్షమవుతాడుట స్టీఫెన్. న్యాయం కోసం పోరాడుతాడట.

అంటరానితనం నేరమంటాడు. అందరూ సమానం కావాలంటాడు.

అతని ధాటికి జడిసి పెద్ద కులాల వాళ్ళే అతనితో ఎక్కువగా స్నేహం చేస్తుంటారు. కుల మతాల్ని పట్టించుకోకుండా తమ ఇళ్ళకు సైతం తీసుకెళ్తుంటారు.

సహాయం కోసం వచ్చిన వాళ్ళకు చెయ్యందించకుండా ఉండలేడుట. తనతో బాటు ఈ పాలెంలో మరో నలుగురు ప్రభుత్వం సహాయం పొందేందుకు అతనెంతో కృషి చేశాడు.

స్వతహాగా తెలివిమంతుడైన తన కొడుక్కి కోచింగ్ ఇప్పించి ఇంజనీరింగ్ సీటు తెప్పించాడు. వాణ్ణి అతడే చదివిస్తున్నాడు. అమ్మా నాన్నల్ని కూడా మరిచేంత ప్రేమను చూపిస్తున్నాడు. తోటి మాలలంతా అతనికోసం వెళ్తోంటే అతను తన్ను చూట్టానికి రావటం...!

కొండన్నకు ఏనుగెక్కినంత సంబరం కలిగింది.

పత్తి గంపలు మోసిం తర్వాత పటపట కట్టెపేళ్ళు చీల్చాడు. అంగడి కెళ్ళి గోధుమపిండి కొనుక్కొద్దామని మళ్ళీ చాలించుకొన్నాడు. స్టీఫెన్‌కు పల్చగా కాల్చిన జొన్న రొట్టెలంటే మహా ప్రీతి!

నాల్గుగంటల టిఫెన్‌కు అవే వడ్డిద్దామనుకొన్నాడు.

"యాం దీమాసీ - యింగా ఎర్రిసూపులు సూస్తాండడూ! కోన్ని కోసేదిలే...? దడెం సియ్యలు బడే కోడిపుంజు దెస్చివి. ఇప్పుడు కోస్చేగాదూ, అయిపొయ్యేది?"

వెంకటమ్మ మాటల్తో లేచాడు.

చూరుకత్తి నూరి గంపకింది కోణ్ణి పట్టుకొనేసరికి ఊర్లోంచి ఇళ్ళకొస్తూ అతని వద్ద ఆగాడు ఓబన్న. "మాపిటేలగ్గాని స్టీపెనయ్య యీడికి రాలేడంట. నీకు జెప్పమన్నెడు" చెప్పాడు.

ప్రశ్నార్థకంగా అతని కేసి చూశాడు కొండన్న. "రేత్తిరి గ్గాడా యీడికేమొస్చడోబ్బా! నొసలు ముడేశాడు కొండన్న.

"రొండు కోల్ల గోసిందు పెద్ద రెడ్డి. బ్రాందిగ్గూడా మనసుల్ను పంపిచ్చిండు" అసలు విషయం బైటేశాడు.

మనసారా స్టీఫెన్ ఇక్కడకు రావాలనుకొంటే అవేమీ పెద్ద అడ్డంకులుగా తోచలేదు కొండన్నకు.

రొట్టె కాల్చేందుకు జొన్న పిండి కలుపుతోన్న భార్య వద్దకు నడిచాడు. ఆమెతో విషయం చెప్పి కోణ్ణి గంపకింద మూశాడు.

"పొద్దు గల్లవస్చే - పిల్లోని మంచీ సెద్దా అడుగుదామనుకొంటి. రేత్తిరి ఏ జాంకొస్చాడో?" విచారంగా అంది.

"పొద్దున్నే అడగొచ్చులే."

"సీకట్లో దోవబడ్తే ఎట్టజెయ్యాల?"

"మనకాడ ఒక్క పూటన్నా ఉండకుండా పోడులే" చెబుతూ బైటకు నడిచాడు. ఉరుములు మెరుపుల్తో కారుమేఘాలు కమ్ముకొస్తున్నాయి.

నోటికాడి కొచ్చిన పంట వానపాలయ్యేట్టుంది. "వానొచ్చేలోపల బుట్టెడు పత్తి యేరకొచ్చినా మేలేగదా!" అనిపించింది. వీధిలో కొచ్చి పైకెగజూసి పెదవి విరుస్తూ సపారం కింద మంచం మీద వాలాడు.

మొదటి రొట్టె కాల్చి వెంకటమ్మ అతనికి అందించేసరికి వచ్చి పడింది వాన. రొట్టె తినేంత సేపు జమాయించి కురిసింది.

జరపవలసిన నష్టాన్ని జరిపి మెల్లగా పొటుకులోకి దిగింది.

కొండన్నకెందుకో మనస్సులో ఏదో వెలితిగా ఉంది. స్టీఫెన్ వచ్చి వుంటే ఎట్లా ఉండేది!

ఇక్కడ సరైన వసతి లేకపోవచ్చు. కాని... తన లేమిడితనంలోకి అతను జొరబడి వచ్చి కూరుకుపోయి గుండెల్ని కలియబెట్టి ఉంటే ఎంత బావుండేది! పెద్ద రెడ్డిలాగా తను విందు భోజనాలు పెట్టలేకపోవచ్చు. అతను పలువరించే అద్భుతమైన బీదవిందు తనందివ్వగలడు గదా!

ఇక్కడ సపారం కింద మంచంలో కూచుని, పళ్ళెంలోని కోడిపులుసు అద్దుకొంటూ, జొన్న రొట్టె కొరుక్కు తింటూ; జడివానను చూస్తూ - గడపటం ఎంత ఆనందమో - స్టీఫెన్‌కు మాత్రం తెలీదా?

మరెందుకు అక్కణ్ణించి వూడబీక్కుని రాలేకున్నాడు?.....

ఇప్పుడనిపిస్తూ ఉంది - బ్రాందీకూడా తెప్పించారంటే రాత్రంతా అక్కణ్ణించి కదలటం స్టీఫెన్‌కు సాధ్యం కాకపోవచ్చు.

తను ఎదురు చూడటం కూడా దండుగే నేమో!

శరీరమంతా నిస్సత్తువ ఆవరించింది కొండన్నకు.

అంతలో తపేల ప్రకాశం వచ్చాడు.

ఊర్లోకి మాదిగలు వచ్చారట.

బాగా తాగి ఉన్నారట.

తమ కులాన్ని భ్రష్టు పట్టించాలనుకొన్న మాలల్ని బండబూతులు తిడుతున్నారుట.

పెద్దరెడ్డి జోక్యం వల్ల కొంత సద్దుమణిగిందట.

ఆయన మాలపాలేనికి మనిషిని పంపేదుట - రైతులుగా మారిన తమ కోసం. తనకు తలనొప్పిగా ఉందంటూ మిగతా వాళ్ళను పంపాడు కొండన్న - 'మీ నిర్ణయమే నానిర్ణయ' మంటూ.

స్టీఫెన్ ముందుకు పంచాయితీకి వెళ్ళటం అతనికిష్టంగా లేదు.

గంటకంతా తిరిగొచ్చారు వాళ్ళు.

పంచాయితీ సారాంశం విని ఆశ్చర్యపడ్డాడు కొండన్న.

"మీరు కూలి కెళ్ళారు కాబట్టి వాళ్ళ సంకటి తినటంలో తప్పులేదు. అంతే కాకుండా ఈ మాలలు మీ సంకటి కోసం రెడ్ల చేతికిచ్చే గింజలూ, ఉప్పూ, పప్పు అన్నీ వీళ్ళ కుండల్లోటివే కాబట్టి, వీళ్ళ ఇళ్ళలో చేసిన సంకటి తినేందుకు మీరు సంకోచించాల్సిన పన్లేదు" అని వాదించాడుట స్టీఫెన్.

"మాలోల్ల సంగటి మేందింటమా? వాల్లకు కూలికి రాడమే బుద్ధితక్కువైతే..." అన్నారుట మాదిగలు.

గబుక్కున పెద్దరెడ్డి అందుకొని "అయితే పోగాకంట్రా! వాల్ల సంగటి తినని నా కొడుకులు; వాల్లకు కూలి కెట్టా బోతరు?" అన్నాడట.

వంతుపనే చేశారు కాబట్టి సగం కూలి ఇవ్వటమే న్యాయంగా తీర్మానించారుట.

కొండన్న ఆలోచనలో పడ్డాడు.

స్టీఫెన్‌తో కలసి రెడ్డి ఇచ్చిన తీర్పు వెనక ఆంతర్యం అర్థమవుతూ ఉంది. తనకు తెలీకుండానే స్టీఫెన్ రెడ్డికి సహాయపడినట్టుంది.

మాదిగల్ను ఇంకా రెచ్చగొట్టాడు రెడ్డి. మాలోల్లకు మరెప్పుడూ కూలి కెల్లకుండా చేశాడు.

ఊరంతా తిరిగినా ఒక్క రైతు కూడా సంగటి గెలిగించక పోవటానికి వెనుకున్న కారణం ఇప్పుడు తెలిసివస్తోంది.

తమకు సంకటి గెలికిపెడితే తంటా వస్తుందని అయ్యవారి పెండ్లాం అన్నమాటల్లో, తంటా ఎవరి ద్వారా వస్తుందో అర్థమవుతూ ఉంది.

భూముల్లేని మాలలు అప్పోసప్పో మెడకు తగులుకొని రెడ్లచేతుల్లో ఇరుక్కుపోయారు. మరి కొందరు తోటి మాలోనికి కూలికెళ్లేందుకు అభిమాన పడుతున్నారు. అభిమానం అనేకన్నా అసూయ అంటేనే బావుంటుందేమో!

ఈ మాదిగలు కూడా రూపాయి పెంచేసరికి వచ్చారు.

రైతులకు అది కన్నెర్ర అయుండవచ్చు.

కూలి, నాలి చేసికోకుండా వ్యవసాయంలోకి దిగటం తాము చేసిన ఒక మోస్తరు తప్పయితే, రైతులకు వెళ్లే కూలీల్లో తామూ కొంత వాటా పంచుకోవటం క్షమించరాని నేరమైనట్లుంది.

తామెట్లా వ్యవసాయం చేయాలో తెలీకుండా ఉంది.

కూలీలుగా బతికే కులం రైతులుగా తయారుకావటం ఎంత కష్టమో ఎంతమందికి కంటగింపో ఇప్పుడర్థమవుతూ ఉంది.

గవర్నమెంటు ఇచ్చిన మోటార్లనీ, పైపుల్నీ, ఎద్దుల్నీ, బండ్లన్నీ అమ్ముకుని ప్రభుత్వ పథకాల్ని మాల మాదిగలు ఎందుకు దుర్వినియోగం చేస్తున్నారో ఇప్పుడు బాగా అవగాహనకొస్తోంది.

తనకూ అందరిలా అంతో ఇంతో తాగుడూ, పెట్టుబడికి షావుకార్లవద్ద వంగే బీదరికమూ ఉంటే రేపు సీజనుకే బండెద్దులు, బోరుబావులూ అమ్మక తప్పదు గదా!

పంచాయితీని గురించి ఆలోచించే కొద్దీ స్టీఫెన్ ప్రవర్తన వింతగా తోచింది కొండన్నకు.

కుల ప్రసక్తి లేని కూలి పంచాయితి చేసుండొచ్చు గదా! వాళ్లను రెచ్చగొట్టటమేమిటి? తన కులం వాళ్లకి సహాయం చేద్దామనుకొన్నాడు కాబోలు.

ఇది సహాయ మెట్లా అవుతుంది?

పంచాయితీలో మాదిగలకు అన్యాయం జరిగింది.

దాని ప్రతిఫలం ఖచ్చితంగా మాలల మీద పడుతుంది. పక్క తాలూకాలోని నీళ్ల పంచాయితీలో కూడా విఫలమై వచ్చాడుట స్టీఫెన్. తమకు చెందిన మంచినీళ్ల గుంటలో మాలలు నీళ్లు తెచ్చుకొనేందుకు రైతులు ఓమెలిక పెట్టారుట. మాదిగ వాడలో కూడా ఉన్న ఒక్క బోరు బావీ చెడిపోయే దశలో ఉంది. కాబట్టి మాల మాదిగలిద్దరూ ఒకేరేవులో దిగి నీళ్లు ముంచుకెళ్తే తమకు అభ్యంతరం లేదన్నారుట.

ఈ ప్రతిపాదనకు కలెక్టరు కూడా సమ్మతించాడుట.

రెండు మైళ్ల దూరంలోని చెలమనీరు తెచ్చుకోవటమే తమకు సమ్మతంగా వెనుదిరిగి పోయారుట మాలలు.

తమను తక్కువగా చూసే అగ్రవర్ణాల మీద దళితుల పక్షాన తిరుగుబాటుజెండా ఎగరేస్తున్న ఈ స్టీఫెన్ దళితుల్ని ఏకం చేయకుండా ఎట్లా యుద్ధం చేయాలనుకొన్నాడు? ప్రత్యర్థిని ఎదుర్కొనే ముందు తమలో తాము వైషమ్యాల్ని చంపుకోవాలి గదా!

పల్లెలంత జటిలంగా ఈ సమస్య నగర దళితుల మధ్య లేకపోవచ్చు. కానీ దళితులంతా ఒక్కటే గదా!

ప్రస్తుతం నగరాల్లో దళిత ఉద్యమం మంచి ఊపు మీదుంది గాని - అందులో కూడా అపశ్రుతి జీర స్పష్టమవుతోంది. తమను చూసి అగ్రవర్ణాల వాళ్లు నవ్వుకొనేలా కులాల పేరిట అనైక్యతా వేదికలు, అస్పష్ట శంఖారావాలు పెచ్చుమీరుతున్నాయి. ఈ వివక్ష అనువంశిక లక్షణాలు విద్యావంతుల్లో సైతం చావకుండా ఉండటం విచిత్రంగా ఉంది.

పల్లెనించి పైకెదిగి మంచి హోదాలో ఉన్న ప్రతి హరిజనుడూ తన పల్లెను మరుస్తున్నాడు. తల్లి మట్టిని విస్మరిస్తున్నాడు. తన వాళ్లను పైకి తెచ్చేందుకు ప్రయత్నించడంలేదు - అగ్రవర్ణాల వాళ్లలా!

పల్లెకొస్తే అక్కడి పెద్ద కులాల వాళ్లు అతన్నింకా తక్కువ కులం వాడిగా చూస్తారని అనుమానం. ఫలానా వృత్తిపనివాడి కొడుకుగా వేలెత్తి చూపుతారేమోననే ఆత్మన్యూనతా భావం.

స్టీఫెన్‌కు కూడా అలాంటి భావమే ఉందేమో!

తన ఇంటి కొచ్చేందుకు ఆ భావమే అడ్డు పడిందేమో!

తనెరిగిన స్టీఫెన్‌కు అలాంటి భావం లేదనుకున్నా, పెద్దరెడ్డి వలలో పడింతర్వాత ఖచ్చితంగా వచ్చి దొందుకుని ఉంటుంది.

రేపు తన కొడుకు కూడా ఇట్లాగే ప్రవర్తించవచ్చు బహుశా.

ఇప్పటికే - సంవత్సరానికి ఒక్కసారి కూడా ఇక్కడకు రావటంలేదు. వచ్చినా నాల్రోజులు కూడా ఉండటం లేదు.

ఉన్న రోజుల్లో కూడా ఎవరితో కలవడు, ఏకాంతంగా చేలెంట, చెట్లంట తిరగటం తప్ప.

వాడికీ, తమకూ మధ్య ఏదో పెరిగి పోతున్నట్లుగా అన్పిస్తూంది.

చిన్నప్పటినుంచీ వాడు మంచి మేధావే.

వాడి తెలివి చూసే స్టీఫెన్ చేరదీసినట్లుంది.

వాడికి పెద్ద హోదా కల్పించి రేపు అల్లునిగా కూడా చేసికోవచ్చు. ఈ విషయంలో తమ సహకారం స్టీఫెన్‌కు పెద్దగా అవసరం లేకపోవచ్చు.

ఎంతగా మారిపోయాడు?

హైదరాబాదు వెళ్లినప్పుడంతా పల్లె రుచుల్ని గురించీ, సావాసాల్ని గురించీ పలవరించే దంతా... పెద్దరెడ్డి సరసన కూచోగానే మాసిపోయినట్లుంది.

దళితుల పక్షాన పోరాడేవాడు దళితుల్ని మరవటం వింతగా ఉంది.

పెద్దరెడ్డి విసిరిన వల బాగా కన్పిస్తూ ఉంది గదా!

అయన హోదా ముందు తమ పాలేనికి వచ్చేందుకు నామోషి పడ్డాడేమో!

తోటి మాలలంతా వచ్చి పెద్దరెడ్డితో సమానంగా తన్నూ గౌరవించేసరికి - రెడ్లు నీచంగా చూసే ఇళ్ళకు తాను అతిథిగా వెళ్లేందుకు సిగ్గుపడ్డాడు కాబోలు. రెడ్డి ముందు చులకన అవుతా ననుకున్నాడేమో!

రెడ్డికీ, స్టీఫెన్‌కూ పెద్ద తేడా ఏమీ కన్పించలేదు కొండన్నకు.

తరతరాలుగా రెడ్లు దళితుల శ్రమను దోపిడీ చేస్తున్నారు. స్టీఫెన్ లాంటి వాళ్లు దళిత వనంలో వికసించిన మేధావి పూలను తుంచుకుపోతున్నారు. పల్లె దళితుల్ని మోదు పైరుగానే ఉండేటట్లు చూస్తున్నారు.....

రాత్రంతా ఆలోచిస్తూనే ఉన్నాడు కొండన్న.

*   *   *   *

మాదిగలకు న్యాయమైన కూలి ఇచ్చేందుకు నిర్ణయించుకున్నాడు కొండన్న, తనతోటి వాళ్లతో కలిసి చర్చించాడు కూడా.

ఉదయం వంతు పనెక్కువ జరుగుతుంది కాబట్టి సగం కంటే కొంత ఎక్కువ కూలి ఇస్తూ సంకటి ఖర్చు కట్టించాలనుకున్నాడు.

"టీపెనన్న వూరికి పోతాండంట. నీతో ఏదో మాట్లాడాల్నంట. అడ్డరోడ్డు కాడికి రమ్మన్నెడు. పొయ్యిరాపో!" వెంకటమ్మ చెప్పింది.

"నువ్వేపో..." సమాధానమిచ్చాడు కొండన్న.

"యాందీ మాసీ..." అంటూ ఆశ్చర్యపోయింది ఆమె.

డబ్బు జేబులో దురుముకుని, కోడి పుంజును చంకన పెట్టుకొని మాదిగిండ్లకేసి సాగే మొగున్ని చూసి విస్తుబోయింది.

రాత్రి స్టీఫెన్ బొజ్జకు కాకుండా, ఇప్పుడు మాదిగిల కోసం ఈ కోడిపుంజు వినియోగపడుతున్నందుకు కొండన్నకు కొండంత ఆనందంగా ఉంది.

◆ *ఆంధ్రప్రభ వీక్లీ* - ***20.11.1996*** ◆